REGD No. H 18 విడి ప్రతి 0–25 పై. 9–12–66 శుక్రవారం

# జమీన్‌రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 49

## ఇంకొక కొత్త పార్టీ!

ఉండే పార్టీలు చాలక ఇంకొక కొత్తపార్టీ వెలసింది–దేశాన్ని ఉద్ధరించడానికి! ఈ కొత్తపార్టీ కాంగ్రెస్‌లోని మరో పేలిక. మంత్రిత్వం పొందలేకపోయిన ప్రొఫెసర్ హుమయూన్‌కబీర్, అధికారానికి దూరమైన హరేకృష్ణమెహతాబ్ ఇత్యాదులు దీనినాయకులు. ప్రతిరాష్ట్రంలో ఏర్పడిన అసంతృప్తి కాంగ్రెస్‌వాదులు, చిల్లరపార్టీలు దీనిబలం. పేరు 'జనకాంగ్రెస్' అట. దీనిలో జనంమాత్రం వుండబోరనుకోండి!

# నెల్లూరుజిల్లాకాంగ్రెస్‌అభ్యర్థులు

## అధికార వర్గానికి 10, ఆనంవారి వర్గానికి 5

## కొండయ్యకు కావలి, సంజీవరెడ్డికి ఆత్మకూరు, రాఘవయ్యకు నెల్లూరు, దశరథరామరెడ్డికి అల్లూరు, వెంకురెడ్డికి కోవూరు, సర్వేపల్లికి నానాదాస్

### కనిగిరి నిర్ణయాధికారం గోపాలరెడ్డికి అప్పగింత

### ఉదయగిరి స్థానానికి పులి వెంకటరెడ్డి, కోవి రామయ్యలలో ఎవరో ఒకరు

నెల్లూరుజిల్లాలోని వివిధ నియోజక వర్గాలకు సంబంధించి త్రిసభ్యసంఘం ఈ క్రింది అభ్యర్థులను నిర్ణయించినట్లు అధికారికంగా కాకపోయినా, అధికారికంగా పరిగణించదగిన వర్గాలనుండి తెలుస్తున్నది–

దర్శి: దిరిశాల వెంకటరమణారెడ్డి, పొదిలి: కాటూరు నారాయణస్వామి, కందుకూరు: ఎన్. చెంచురామానాయుడు, కొండపి: దాగంటి రోశయ్యనాయుడు, కావలి: టి. సి. కొండయ్య, ఆత్మకూరు: ఆనం సంజీవరెడ్డి, నెల్లూరు: వెన్నెలకంటి రాఘవయ్య, సర్వేపల్లి: మంగళగిరి నానాదాస్, గూడూరు: పనుబ్లేటి సిద్ధయ్యనాయుడు, రాపూరు: ఎ. సి. సుబ్బారెడ్డి, వెంకటగిరి: అల్లం కృష్ణయ్య, సూళ్లూరుపేట: ఎం. మునుస్వామి.



సంజీవయ్యను పట్టుకొని, గుట్టుచప్పుడుగా సీటు సంపాదించుకున్న శ్రీ నానాదాస్

కనిగిరిస్థానానికి అభ్యర్థిని నిర్ణయించే బాధ్యత పార్లమెంటుఅభ్యర్థిఅయిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారికి అప్పగించబడిందట. అంటే ఇది శ్రీ మౌలాసాహెబుకు యివ్వబడుతుందని నిర్ణయించుకోవచ్చు.

కనిగిరి మౌలాసాహెబుకు యిచ్చే పక్షంలో; ఉదయగిరి పులి వెంకటరెడ్డి, కోవి రామయ్యచౌదరిగార్లలో ఎవరో ఒకరికి యివ్వవలసిందిగా త్రిసభ్య సంఘం సిఫారసుచేసినట్లు తెలుస్తున్నది. అంటే ఈ ఇద్దరిలో ఎవరికివ్వవలసింది నయోధ్యుల అభీష్టానికి వదలివేయబడిందన్నమాట.

త్రిసభ్యసంఘం నిర్దేశితసూత్రప్రకారం కొండయ్యగారికి నెల్లూరు, రాఘవయ్యగారికి కావలి కేటాయిస్తూ, ఇరువురూ అంగీకరించేపక్షంలో పరస్పరం నియోజకవర్గాలు మార్చుకోవచ్చునని సూచించిందట. దానిపై వారు అవిధంగా తమ సమ్మతిని వ్రాసియిచ్చినట్లు తెలుస్తున్నది.

అల్లూరు–కోవూరు నియోజక వర్గాలు వేమారెడ్డి వెంకురెడ్డి, బెజవాడ దశరథరామరెడ్డి గారలకు కేటాయించారట. దశరథరామరెడ్డిగారిని ప్రస్తుతం వారు ప్రాతినిధ్యం వహిస్తున్న కోవూరుకు సూచించారని; కాని ఇప్పుడు అల్లూరు దశరథరామరెడ్డిగారి స్వంత నియోజకవర్గం అవుతుంది కాబట్టి,

—కొరవ 7 వ పేజీలో

# ఆంధ్రలో మూడో వర్గం

## బ్రహ్మానందరెడ్డి పక్షంగా అనూహితంగా గట్టిగా నిలబడి వాదించిన ప్రధాని

### నిర్ణయాలు బ్రహ్మానందరెడ్డికే అనుకూలం కావచ్చు–ఢిల్లీలోనే వుండవలసిందిగా సంజీవరెడ్డి కోరబడవచ్చు

(మా హైదరాబాదు విలేఖరి)

అనిశ్చితంగానేకాక అయోమయంగా కూడా రాష్ట్రకాంగ్రెస్ రాజకీయాలు తయారవుతున్నాయి. ఢిల్లీకివెళ్ళిన ప్రముఖులు ఇంకా తిరిగిరాలేదుకాని అక్కడికి సమ్మకమైన వర్గాలద్వారా అందుతున్న సమాచారమీ విషయాన్నే ధృవపరుస్తున్నది.

ఇన్నాళ్లు మనరాష్ట్రంలో రెండువర్గాలు మాత్రమే–ఒకటి సంజీవరెడ్డిగారిది, (అంటే కామరాజ్ గారిది), రెండవది బ్రహ్మానందరెడ్డిగారిది (అంటే ప్రధాని ఇందిరాగాంధీ గారిది) వున్నాయి. ఇకముందు మూడవది, మొరార్జీ దేశాయిగారిది కూడా వుంటుంది. ఈ నూత్న మూడవవర్గమెట్లా వ్యవహరిస్తుందో, ఎప్పుడు ఎవరితో కలుస్తుందో తెలియదు. కనుకనే అయోమయావస్థ.

ఢిల్లీనుంచి వస్తున్న వార్తల ప్రకారం, కాంగ్రెస్ అధ్యక్షునికీ, ప్రధాన మంత్రికీ మధ్య అభిప్రాయ భేదాలు బాగా ప్రగాఢంగా ఏర్పడ్డాయి. ఏదో తంటాలు పడి తమ అభ్యర్థుల పట్టికలకు ఆమోదముద్ర వేయించుకొని తెచ్చుకుందామని ఢిల్లీవెళ్ళిన ఆంధ్రకాంగ్రెస్ నాయకులకు దిగ్భ్రాంతి కలిగించేటట్టు ఈ పరిణామం కనిపించింది. ఇలాంటి పరిస్థితికే కనిపెట్టుకొని కూర్చున్న మొరార్జీదేశాయిగారు ఒకొక్కసారి ఒక్కొక్క సిద్ధాంతంపేర ఒకొక్కరిని నమ్ముకొని తమ వ్యక్తిగత బలంపెంచుకొని, ప్రభావాన్ని పెంచుకుంటున్నారు. హఠాత్తుగా ప్రవర్తించి, తమ ప్రతిష్ఠనుకూడా ఇనుమడింప చేసుకుంటున్నారు.



రాష్ట్రంలో మూడవ వర్గానికి బీజంవేసిన మొరార్జీ

ఈ కారణాన్నే దిక్కులు పేటిలతో చూడుకొన్న ఆంధ్ర అభ్యర్థుల నిర్ణయ బాధ్యత అప్పగించబడిన త్రిసభ్య ఉపసంఘంలో మొరార్జీగారుకూడా వున్నారు. మిగతా యిద్దరైన వై. బి. చవాన్, యస్. కె. పాటిల్‌గార్లలో మొదటివ్యక్తి ప్రధాన మంత్రి ప్రతినిధి, రెండవవ్యక్తి కాంగ్రెస్ అధ్యక్షునిప్రతినిధి నివేరే చెప్పనక్కరలేదు.

ఉక్కుఫ్యాక్టరీ స్థాపనపేర జరిగిన ఆందోళనకారణంగా ఆంధ్రప్రభుత్వంపట్ల ప్రధానికి ఆగ్రహంకలిగిందికనుక బ్రహ్మానందరెడ్డిని ఢిల్లీలో అడిగేవారెవరూ వుండరనుకున్న తిరుగుబాటువర్గ నాయకులకు తీరని నిరాశ కలిగింది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలసంఘం సిఫారసులను కేవలం ఒక ముఠా సిఫార్సులుగా భావించడానికి వీల్లేదని ప్రధానమంత్రి గట్టిగా వాదించారట. రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒక ముఠా నాయకుడుగా భావించి, ఆయనతో ఆ విధంగా ప్రవర్తించడానికికూడా వీల్లేదని ఆమె గట్టిగా చెప్పారట.

ప్రధానమంత్రి ఇంత స్పష్టంగా బ్రహ్మానందరెడ్డిని బలపరచడానికి కారణం లేకపోలేదు. కృష్ణమీనన్‌కు ఉత్తర బొంబాయి నియోజకవర్గం నిరాకరించి సిండికేట్ నాయకులు ఢిల్లీలో అత్యంత అపకీర్తిపాలు కావడమేగాక, ప్రధానికి చాలా ఆగ్రహాన్ని కలిగించారు. నందాగారి స్థానంలో చవాన్‌ని దేశీయ వ్యవహారాలమంత్రిగా నియమించడాన్నికూడా వీరు వ్యతిరేకించారు. పైగా కామరాజ్, 1967 ఎన్నికల అనంతరం తనతో ప్రధాని పదవికి పోటీచేస్తారని విశ్వసిస్తున్న ఇందిరాగాంధి కామరాజ్‌కు సన్నిహితుడుగా భావింపబడుతున్న సి. ఎం. సంజీవరెడ్డిని సమర్థించకపోవడంకూడా అనంతకమే.

కామరాజ్‌గారు తన సహచరుడైన సంజీవరెడ్డికి మద్దతు చేయడానికి ప్రధాని, మొరార్జీదేశాయి ఉభయులు అడ్డుతగిలారు.

—కొరవ 6 వ పేజీలో

